
నేడు పాలిసెట్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 26: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2024 అర్హత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ మైనార్టీ ప్రిన్సిపాల్ చక్రవర్తి తెలిపారు. 27న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 7,245 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ విద్యార్థుల కోసం ఆదోని, కర్నూలు పట్టణాల్లో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

పక్కా వంచన

ఇళ్లు లేవు.. ఊళ్లు లేవు..!

కోసిగిలో జగనన్న కాలనీ ఇది



- పేదలను దగా చేసిన జగన్ ప్రభుత్వం
- పలు గ్రామాల్లో పునాదులు దాటని జగనన్న కాలనీలు
- జిల్లాలో మంజూరు చేసిన ఇళ్లు 40,815.. నిర్మాణాలు పూర్తైనవి 17,034
- గత టీడీపీ ప్రభుత్వంలో 1.05 లక్షల ఇళ్లు మంజూరు.. 51,191 పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 82,872 ఇళ్లు పూర్తి

కర్నూలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

చిత్తశుద్ధికి తాను ప్రతిరూపమని సీఎం జగన్ ప్రచారం చేసుకుంటారు. నోటెంట వచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నానని ఊదరగొడతారు. గత ఐదేళ్ల ఆయన మాటలను, పాలనను పరిశీలిస్తే పొంతన లేదని ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. మాయ మాటలు, నీట మూటలు సీఎం సొత్తని రుజువు అవుతుంది. దానికి ప్రబల ఉదాహరణ జగనన్న ఇండ్లు, జగనన్న కాలనీలు. నవరత్నాల్లో భాగంగా ఇండ్ల పథకం గురించి వైసీపీ అంతూపొంతూ లేకుండా ప్రచారం చేసుకుంది. ఐదేళ్లపాటు దాన్ని భరించడం ప్రజలకు కష్టంగా ఉండేది. ఈ ఎన్నికల వేళ క్షేత్ర పరిశీలన చేస్తే ఈ అసంబద్ధత అంతా బట్టబయలవుతున్నది.

జిల్లాలో నాటి చంద్రబాబు ప్రభుత్వంలో పేదల ఇళ్ల పురోగతి			
పక్కా గృహాలు	మంజూరు	పూర్తైన ఇళ్లు	శాతం
ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్	70,015	35,521	50.73
ఏపీ టిడ్కో ఇళ్లు	17,984	15,670	87.13
మొత్తం	**87,999**	**51,191**	**58.17**

జిల్లాలో నేటి జగన్ ప్రభుత్వంలో ఇళ్ల పురోగతి			
నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు	40,815	17,034	41.73
ఏపీ టిడ్కో	--	--	--
మొత్తం	40,815	17,034	41.73

రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చాం.. పక్కా ఇళ్లు నిర్మిస్తున్నాం..! అని సీఎం జగన్ సహా వైసీపీ నాయకులు పదేపదే చెప్పారు. అధికార కాలపరిమితి ముగిసిపోయింది. ఇప్పుడు వాస్తవాలను చూస్తే ఓట్లాటలో జగన్ మాటల గారడీ బట్టబయలవుతుంది. గూడు లేని నిరుపేదలను ఆయన ఘోరంగా వంచించారు. లక్షల మందికి అవాసం కల్పిస్తామని గ్రామాలకు దూరంగా.. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో సెంటు స్థలం పేరిట ప్రజా ధనం లూటీ చేశారు. కొండలు.. గుట్టలు.. వంకల్లో పట్టాలిచ్చి ఇళ్లు నిర్మిస్తామంటూ దగా చేశారు. కర్నూలు జిల్లాలో ఐదేళ్లలో 40,815 మందికి పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ఐదేళ్లలో నిర్మాణాలు పూర్తైన గృహాలు 17,034 మాత్రమే. అంటే.. మంజూరు చేసిన అరకొర ఇళ్లలో 42 శాతం కూడా పూర్తి చేయనే లేదు. అదే.. గత టీడీపీ ప్రభుత్వం వివిధ పథకాలు కింద 87,999 ఇళ్లు మంజూరు చేసి.. 51,191 ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలు కల్పించారు. అదే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1.76 లక్షల ఇళ్లు మంజూరు చేసి 82,872 ఇళ్లు పూర్తి చేశారు. పేదల పట్ల ప్రేమ ఉంటే చంద్రబాబులా పాలన చేయాలి. ఇదీ నిజమైన చిత్తశుద్ధి.



పునాదుల్లోనే ఆదోని మండలం డాణాపురం సమీపంలో నిర్మిస్తున్న ఇళ్లు

టీడీపీ ప్రభుత్వంలో 81,872 ఇళ్లు పూర్తి:

గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ స్కీమ్, పీఎంఏవై-ఎన్టీఆర్ పట్టణ గృహనిర్మాణ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,16,693 పక్కా గృహాలు, కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో ఐదు విడతల్లో 59,403 ఏపీ టిడ్కో ఇళ్లు కలిపి 1.76 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. అందులో 82,872 ఇళ్లను పూర్తి చేశారు. అందులో కర్నూలు జిల్లాలో ఒక్కటే 87,999 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి 51,191 ఇళ్లను పూర్తి చేశారు. మిగిలిన ఇళ్ల మెజార్టీగా రూఫ్‌కాస్ట్ లెవన్ (పైకప్పు) వరకు వచ్చాయి. ఆనాడు ఎన్టీఆర్ బలహీనవర్గాల కాలనీల పేరిట నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే స్ఫూర్తితో నీడ లేని పేదలకు సొంతింటి కల సాకారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. ఇందుకు గత ప్రభుత్వంలో కట్టించిన ఇళ్లే నిదర్శనం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి పేర్కొన్నారు.

ఎవరిది చిత్తశుద్ధి..?

- జగన్ ప్రభుత్వం 40,815 ఇళ్లు మంజూరు చేసి 17,034 ఇళ్లు మాత్రమే పూర్తి చేస్తే.. గత చంద్రబాబు ప్రభుత్వం ఒక్క కర్నూలు జిల్లాలో 25 మండలాల్లో 87,999 మంది పేదలకు పక్కా గృహాలు మంజూరు చేశారు. 2019 ఫిబ్రవరి 9 నాటికి 51,191 ఇళ్లు పూర్తి చేసి 58.17 శాతం పురోగతి సాధించారు. జగన్ కంటే 34,157 ఇళ్లు ఎక్కువగా నిర్మించారు.
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1.50 లక్షల ఉపాధి హామీకి రూ.30 వేలు కలిపి రూ.1.80 లక్షలు మాత్రమే ఆర్థిక సాయం చేసి.. అంతా తామే ఇచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. గత చంద్రబాబు ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సాయం కాదని గ్రామీణ ప్రాంతాల లబ్ధిదారులకు రూ.50 వేలు, పట్టణ లబ్ధిదారులకు రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందించింది.
- జగన్ ప్రభుత్వంలో ఇసుక దొరకక గృహ నిర్మాణ లబ్దిదారులు అవస్థలు పడ్డారు. ట్రాక్టర్ రూ.3,500 నుంచి రూ.5 వేలు వరకు కొనుగోలు చేశారు. అదే చంద్రబాబు ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక ఇచ్చారు.

ఎమ్మిగనూరు పట్టణంలో ఇళ్ల మధ్యలో పెరుగుతున్న ముళ్ల కంపలు



ఓట్లాటలో సామాన్యులను మాయ చేయడం జగన్‌కు తెలిసినంతగా మరే పార్టీ నాయకుడికి తెలియదనే చెప్పాలి. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించడంలో టీడీపీ అధినేత చంద్రబాబు కాస్త వెనకపడ్డారనే చెప్పాలి. అదే సీఎం జగన్ తాను తప్ప మరే ప్రభుత్వం ఇంతలా అభివృద్ధి, సంక్షేమం అమలు చేయలేదనే మాట గారడితో బూరిడీ కొట్టించడంలో దిట్ట అని విశ్లేషకులు అంటున్నారు. ఎమ్మిగనూరు సిద్ధం సభలో నా అక్కచెల్లెమ్మలకు లక్షల ఇళ్లు కట్టించాను.. అని సీఎం జగన్ గొంతుచించుకు చెప్పారు. అవునా.. పేదలకు లక్షల ఇళ్లు కట్టించారా..? లెక్కలు వేస్తే ఇదంతా ఎండమావి అని ఎవరికైనా తెలుస్తుంది. జగన్ కట్టించ్చిన ఇళ్ల వ్యవహారం కూడా అంతే. జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో జగన్ ప్రభుత్వం 'నవరత్నాలు-పేదలు అందరికి ఇళ్లు' పథకం కింద 389 లే-అవుట్లలో సెంటు స్థలం పేరిట అనువుగాని కొండలు, గుట్టలు, వంకల్లో స్థలాలు ఇచ్చారు. మెగా గ్రౌండింగ్ మేళా పేరిట అర్భాటం చేశారు. జగన్ తప్ప ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టించలేదేమో..! అన్నంతగా ప్రచారం చేశారు. తీరా చూస్తే.. ఓట్ల కోసం ఇళ్ల పేరిట పేదలను వంచనకు గురి చేశారని స్పష్టంగా అర్థం అవుతుంది. జిల్లాలో 25 మండలాల్లో కేవలం 40,815 ఇళ్లు మంజూరు చేస్తే.. ఇప్పటి వరకు పూర్తి చేసిన ఇళ్లు 17,034 మాత్రమే. అంటే.. 42 శాతం కూడా దాటలేదు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకపోవడానికి ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చే యూనిట్ కాస్ట్ (విలువ) సరిపోకపోవడమే. అప్పులు పుట్టక పేదలు ఇల్లు కట్టుకోడానికి ఆసక్తి చూపడం లేదు.



వచ్చే నెలలో అరాచక పాలన అంతం

- రాష్ట్రాన్ని నాశనం చేసిన సీఎం జగన్ ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 26: వచ్చే నెల 13వ తేదీతో అరాచక పాలన అంతం కావడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్‌లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో అధికారం చేపట్టిన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడడంతోపాటు బడుగు, బలహీన వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురయ్యాయని తెలిపారు. ఒక్కసారి నమ్మి వైసీపీకి ఓటు వేస్తే అభివృద్ధిలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కుపోయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో పీఆర్సీ డీఏ అమలు, సీపీఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన జగన్‌రెడ్డి ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతాడని నిలదీశారు. ఎంపీ సంజీవకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో సామాజిక న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సొంత చిన్నాన్నను చంపిన హంతకుడిని వెంటేసుకుని ప్రచారం చేయడం సిగ్గుగా అనిపించడం లేదా అని మండిపడ్డారు. తల్లి, చెల్లి, పిన్నమ్మకు న్యాయం చేయలేని దద్దమ్మ జగన్‌రెడ్డికి పాలించే అర్హత లేదన్నారు. సమావేశంలో మహిళా నాయకురాలు ముంతాజ్ బేగం, సత్రం రామకృష్ణుడు, జేమ్స్, ఆకెపోగు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- జడ్పీటీసీ, సర్పంచ్ వర్గాల మధ్య వాగ్వాదం
- కుడా చైర్మన్ కోట్ల హర్ష, వైసీపీ అభ్యర్థి సతీష్ సమక్షంలోనే గొడవ
- వైసీపీ జెండాలు తగలబడిపోకుండా మంటలు ఆర్పేసిన స్థానిక నాయకులు

కర్నూలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జెండాలు చేతబట్టి జేజేలు కొట్టాల్సిన పార్టీ నాయకులు, కార్యకర్తలే ఈ జెండా తమకొద్దంటూ కింద పడేసి కాళ్లతో తొక్కేశారు. నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారు. స్థానిక నాయకులు అడ్డుకోవడంతో నిప్పు రగలకుండానే స్థానిక నాయకుల జోక్యంతో ఆర్పేశారు. వైసీపీలో భగ్గుమన్న విభేదాలు, నాయకుల మధ్య వాగ్వాదం జెండాలకు నిప్పు పెట్టేలా చేసింది. వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో గూడూరు మండలం ఆర్.ఖానాపురం గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. కోడుమూరు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్, వైసీపీ సీనియర్ నాయకుడు, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి గూడూరు మండలం ఆర్.ఖానాపురం గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన గూడూరు జడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, గ్రామ సర్పంచ్ మునిస్వామి గ్రామానికి వచ్చిన నాయకులకు స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారం తమ వీధి నుంచి మొదలు పెట్టాలని జడ్పీటీసీ, సర్పంచ్ ఇద్దరు పట్టుబట్టారు. ఈ క్రమంలో అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్ష సమక్షంలోనే ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలైంది. ఘర్షణ వాతావరణ ఏర్పడింది. ఇరువర్గాల మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అయితే.. గ్రామ సర్పంచ్ మునిస్వామి మాటకు విలువ ఇవ్వకుండా జడ్పీటీసీ సభ్యుడు మౌలాలి సూచించిన వీధిలో ప్రచారానికి వైసీపీ అభ్యర్థి సతీష్ సహా ఆ పార్టీ నాయకులు వెళ్లారు. ఇష్టమైతే రండి.. లేదంటే వెళ్లిపోండి..! అంటూ సర్పంచ్ వర్గాన్ని ఉద్దేశించి వైసీపీ నాయకుడు ఒకరు అన్నట్లు సమాచారం. అప్పటికే గ్రామ సర్పంచ్‌గా తాము సూచించిన వీధుల్లో ప్రచారానికి రాలేదనే అవమానంతో రగిలిపోతున్న మునిస్వామి వర్గానికి వైసీపీ నాయకుడి మాటలు మరింత ఆజ్యం పోశాయి. ఆగ్రహంతో రగిలిపోయారు. అప్పటి వరకు చేతబట్టుకొని జేజేలు కొట్టిన వైసీపీ జెండాలను నేల మీద పడేసి కాళ్లతో తొక్కారు. వైసీపీకి, అభ్యర్థి సతీష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ జెండాలను కుప్పగా పోసి అగ్గిపుల్ల గీసేసి నిప్పు పెట్టారు. మంటలు చెలరేగకుండా స్థానిక నాయకులు అడ్డుకొని అగ్గిపుల్లను ఆర్పేశారు. ఈదే జరగకపోయి ఉంటే వైసీపీ నాయకులు, కార్యకర్తల ఆగ్రహ జ్వాలకు ఆ పార్టీ జెండాలు కాలిబూడిదయ్యేవని స్థానికులు పేర్కొన్నారు. గూడూరు మండలం వైసీపీలో అభ్యర్థి ప్రచారంలో విభేదాలు భగ్గుమనడం కొసమెరుపు. దీంతో ఆర్.ఖానాపురంలో ఉద్రిక్తత వాతావరణ నెలకొంది.



వైసీపీ జెండాలకు నిప్పు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు



ఆర్. ఖానాపురంలో వాగ్వాదం చేసుకుంటున్న వైసీపీ కార్యకర్తలు, నాయకులు



ఆంధ్ర -తెలంగాణ బార్డర్ సుంకేసుల చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ జి.కృష్ణకాంత్

చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా ఉంచాలి

ఎస్పీ జి. కృష్ణకాంత్

గూడూరు ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులలో ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ జి. కృష్ణకాంత్ అన్నారు. శుక్రవారం ఆంధ్ర-తెలంగాణ బార్డర్ జిల్లా సరిహద్దు సుంకేసుల చెక్‌పోస్టును ఎస్పీ జి.కృష్ణకాంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు అక్రమ రవాణా జరగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు, సెబ్ పోలీసులు, లోకల్ పోలీసులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆంధ్ర, తెలంగాణ బార్డర్ చెక్‌పోస్టులలో ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు లభ్యమైతే సీజ్ చేసి అధికారులకు అప్పగించాలన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరెడ్డి, సెబ్ సీఐ మల్లిక, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ శ్యామల, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య ఉన్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం


కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

హొళగుంద, ఏప్రిల్ 26: టీడీపీ ద్వారానే ముస్లింల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం హొళగుందలో వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ అబ్దుల్ సుభాన్ సహా వందకు పైగా ముస్లిం కుటుంబాలకు చెందిన వారు ఆలూరు అసెంబ్లీ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, ఆలూరు అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ పసుపు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగాయని అన్నారు. హజ్ యాత్రకు ఆర్థిక సాయం టీడీపీ ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. టీడీపీ పథకాలు ప్రతి కుటుంబానికి అందించే బాధ్యత ఎంపీగా తాను, ఎమ్మెల్యేగా వీరభద్ర గౌడ్ తీసుకుంటామని వివరించారు.



ముస్లింను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బస్తిపాటి నాగరాజు

29న డోన్‌కు చంద్రబాబు



డోన్, ఏప్రిల్ 26: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల 29న డోన్ వస్తున్నారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను శుక్రవారం పట్టణంలో కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ లీగల్ సెల్ సీనియర్ న్యాయవాది శ్రీనివాసభట్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున తదితరులు పరిశీలించారు. వెంకటనాయునిపల్లి రోడ్డులో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పాతబస్టాండులో గాంధీ విగ్రహం ముందు జరిగే సభ కూడలిని పరిశీలించారు.

చంద్రబాబు పర్యటన ఇలా

ఈ నెల 29న సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రబాబు డోన్‌కు చేరుకుంటారు. వెంకటనాయునిపల్లె రోడ్డులోని హెలిప్యాడ్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహిస్తారు. పాతబస్టాండులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

జూన్ 29కి జాతీయ లోక్ అదాలత్ వాయిదా

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 26: ఈ నెల 11న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూన్ 29వ తేదీకి వాయిదా పడిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, వేసవి తీవ్రత దృష్ట్యా ఈ జాతీయ లోక్ అదాలత్‌ను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ఆలమూరు అధోగతి..!

పట్టించుకోని సీఎం



పాణ్యం, ఏప్రిల్ 26: ఆరేళ్లుగా పంటలు ఎండిపోతున్నాయి.. పట్టించుకోండి అని రైతులు ఎంత మొరపెట్టుకున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదు. పాణ్యం మండలంలోని ఆలమూరు గ్రామంలో దాదాపు 300 ఎకరాల పంట భూములు ఎస్సార్బీసీ కాల్వకు గండి కొట్టడంతో నీరు పంటలను ముంచెత్తుతోంది. దీంతో ముంపునకు గురై పంటలు పండించుకోవడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామంలోని బాధిత రైతులందరూ రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రికి రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ముఖ్యమంత్రి కంటే ముందుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టరు, ఆర్డీఓ, ఎంఆర్‌ఓ తదితర అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వంద మంది రైతులు తమ పొలాలను ఆరేళ్లుగా బీడుగా పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని ఆలమూరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాలు బీడుగా మారుతున్నాయని, పంటలకు నీటిని కేటాయించాలని కోరుతున్నా సీఎం జగన్ పట్టించుకోవడం లేదని పాణ్యం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు సగినేల సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



ఆశా కార్యకర్తలు పోయి వీఆర్వోలు వచ్చే

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 26: ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీఎల్వోలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించేవారు. గత ఎన్నికల్లో సైతం కార్యకర్తలే పని చేశారు. కానీ ఈ ఎన్నికల్లో వారిని దూరంగా ఉంచి ఆ బాధ్యతలను వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది స్వీకరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకుల పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు ఎన్నికల పోలింగు రోజున ఓటర్లకు స్లిప్పులు అందజేసే బాధ్యతలను స్వీరించేవారు. ఈ బాధ్యతలన్నీ నిర్వర్తించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పారితోషికం ఆలస్యంగా చెల్లించినా పని చేసేవారు.

ఈసారి సెక్టోరియల్ అధికారులకు బాధ్యతలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 26: ఎన్నికల్లో పోలింగు సులభంగా ఉండాలన్న ఆలోచనతో ఎన్నికల కమిషన్ ప్రతి నియోజకవర్గంలోని కొన్ని పోలింగు బూత్‌లను కలిపి రూట్లు, జోన్లుగా విభజించేది. అలాగే వీటికి రూట్, జోన్‌ల అధికారులను నియమించి, ఆయా రూట్లకు, జోన్‌లకు బస్సులను ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఎన్నికల్లో రూట్లు, జోన్‌ల మాటే లేదు. వీటికి బదులుగా సెక్టోరియల్ అధికారులను నియమించి పోలింగు బూత్‌లో జరిగే కార్యక్రమాలు మొదలన్నీ వారే చూసుకోవాల్సిన బాధ్యతలను ఎన్నికల కమిషన్ అప్పగించింది.

ఎన్నికల్లో కొత్త ప్రలోభాలు

రుద్రవరం, ఏప్రిల్ 26 : రాజకీయ నాయకులు కన్ను కౌలు రైతు ఓటరుపై పడింది. మోతుదారి రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు షరతులు విధిస్తున్నారు. ఓటు వేయాలని లేదంటే తమ భూములు కౌలుకు ఇవ్వడం కుదరదని చెబుతున్నారు. కౌలు రైతులు చేసేదేమీ లేక ఆ భూములు కోల్పోతే ఉపాధికి ఇబ్బందిగా మారుతుందని ఇష్టం లేకపోయినా తల ఊపాల్సి వస్తోంది. ఇష్టం లేకున్నా ఆ పార్టీ కండువా కప్పుకోవాల్సి వస్తోంది.


ఈ సారి పాలన పగ్గాలు మావే..!



టీడీపీ అభ్యర్థి గౌరు చరిత మహిళా రైతు అవతారమెత్తారు. పసుపు కండువాతో కూడిన తలపాగాతోపాటు ఓ చేతిలో చెలకోల, మరో చేత్తో పగ్గాలు.. ఇలా ఎద్దుల బండిపై నుంచి ముందుకు సాగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం గడివేముల మండలంలోని వండుట్ల గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమకూర్చిన ఎద్దుల బండిపై ఆమె గ్రామంలో కలియతిరిగారు. ఇలా ఆమె ఎద్దుల బండిపై వెళ్తూ గ్రామస్థులను ఆకట్టుకున్నారు. వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని, రైతుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

-గడివేముల






నంద్యాల టౌన్, ఏప్రిల్ 26:

రాష్ట్ర రాజకీయాల్లోనే నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ విలక్షణమైన స్థానం ఉంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు కాకుండా వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వారినే ఎమ్మెల్యేలుగా గెలిపిస్తున్నారు. 1952 నుంచి 2019 వరకు శాసన సభకు 17 సార్లు జరిగిన ఎన్నికల్లో ఏకంగా నాలుగు సార్లు వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చి స్వతంత్ర అభ్యర్థులను ఎన్నుకున్న ఘనత నంద్యాల నియోజకవర్గానికే దక్కుతుంది.



ఓటరు తీర్పు విలక్షణం



- పార్టీలు కాదు.. వ్యక్తులే ముఖ్యం
- నంద్యాల అసెంబ్లీ రాజకీయం ప్రత్యేకం
- నాలుగు సార్లు స్వతంత్రుల హవా
- 1952 నుంచి 2019 వరకు 17 సార్లు ఎన్నికలు
- ఇప్పటి వరకు ఒక్కరికి కూడా దక్కని హ్యాట్రిక్



ఎక్కువ సార్లు గెలిచిన నేతలు

నంద్యాల శాసన సభ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎం సుబ్బారెడ్డి రెండు సార్లు ఎన్నికయ్యారు. స్వతంత్ర, జనతా అభ్యర్థిగా బొజ్జా వెంకటరెడ్డి రెండు సార్లు ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థిగా ఎన్‌ఎండీ ఫరూక్ మూడు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. శిల్పా మోహన్‌రెడ్డి రెండు సార్లు గెలిచారు.

నవ నందుల కూడలిగా

నల్లమల అటవీ ప్రాంత సమీపంలో నవనందుల కూడలిలో ప్రసిద్ధికెక్కిన నంద్యాల రాజకీయాల్లోనూ దేశస్థాయిలో సంచనల నియోజకవర్గంగా ప్రసిద్ధికెక్కింది. జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్కటైన నంద్యాల పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతల దృష్టి అంతా నంద్యాలపైనే ఉంటుంది. 2009 ఎన్నికలకు ముందు జరిగిన పునర్విభజన వరకు నంద్యాల అసెంబ్లీ పరిధిలోని బండిఆత్మకూరు, మహానంది మండలాలు, నంద్యాల పట్టణంలో ఉన్న నవ నం దుల కూడ లిగా రాజకీయాల్లోనూ ఎంతో ప్రాముఖ్యత ఉండేది. అయితే నియోజకవర్గాల పునర్విభజనలో బండిఆత్మకూరు, మహానందిలోని ఆరు నందులు శ్రీశైలం నియోజక వర్గంలో చేరాయి. దీంతో పట్టణంలోని ప్రథమ నంది, సోమనంది. బ్రహ్మనందీశ్వర స్వాముల క్షేత్రాలు మాత్రమే ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్నాయి. ఆళ్లగడ్డ పరిధిలోని గోస్పాడు మండలాన్ని నంద్యాలలో కలిపినప్పటికీ ఎన్నో ఏళ్ల నుంచి నవనందుల కూడలిగా వెలుగొందుతున్న నంద్యాల ఇప్పటికీ అదే స్థాయి ప్రాముఖ్యతతో రాజకీయాల్లోనూ ప్రసిద్ధికెక్కింది.

స్వతంత్ర అభ్యర్థులను గెలిపించిన ఘనత

1952లో స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి జీ రామిరెడ్డిపై ఎం.సుబ్బారెడ్డి విజయం సాధించారు. 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎం సుబ్బారెడ్డిపై జీ రామిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1962లో మరోసారి ఎం సుబ్బారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 1972లో సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నబీసాహెబ్‌పై స్వతంత్ర అభ్యర్థిగా బొజ్జా వెంకటరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. 1978లో తిరిగి నబీసాహెబ్‌పై జనతా అభ్యర్థిగా బొజ్జా వెంకటరెడ్డి గెలిచారు.

నాయకుల వ్యక్తిత్వానికే పెద్దపీట..

నంద్యాల రాజకీయాల్లో రాజకీయ పార్టీలకు కాకుండా, నాయకుల వ్యక్తిత్వానికే ప్రజలు పెద్దపీట వేస్తూ వస్తున్నారు. 1952లో జరిగిన తొలిసారి ఎన్నికల్లోనే ఈ విషయం స్థానిక ప్రజలు రుజువు చేశారు. ఆ ఎన్నికల్లో అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేకుండా ఉన్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గోపవరం రామిరెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఎం. సుబ్బారెడ్డి ఓడించారు. ఇదే పంథాలో నాలుగుసార్లు స్వతంత్ర అభ్యర్థులు నంద్యాల నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. పార్టీలు ఏవైనా వ్యక్తులను బట్టి గెలిపించిన ఘనత కూడా నంద్యాల ప్రజలకు దక్కుతుంది. బొజ్జా వెంకటరెడ్డి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా, 78లో జనతా పార్టీ అభ్యర్థిగా గెలుపొందడం ఇందుకు అద్దం పడుతుంది.

ఇద్దరు నేతలకు మంత్రి పదవులు

రాజకీయ ఉద్దండుల ఖిల్లాగా రాజకీయాల్లో నంద్యాల ప్రత్యేకత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఇద్దరు నేతలకు మాత్రమే మంత్రి పదవులు దక్కాయి. 1985 ఎన్నికల్లో తొలిసారిగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టిన ఎన్‌ఎండీ ఫరూక్‌కు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు క్యాబినెట్‌లో చక్కెర శాఖ మంత్రిగా స్థానం దక్కించుకున్నారు. 1994లో, 99 ఎన్నికల్లో గెలిచిన ఫరూక్‌కు శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా, రాష్ట్ర పురపాలక శాఖ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పదవులను అలంకరించారు. 2009 ఎన్నికల్లో నంద్యాల నుంచి రెండోసారి ఎన్నికైన శిల్పా మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పదవి దక్కింది. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మరణించడం, 2017లో ఉప ఎన్నికలు జరగడం, భూమా బ్రహ్మనందరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం వంటి పరిణామాలు జరిగిపోయాయి. సీనియర్ నాయకుడిగా ఉండి ఉప ఎన్నికలో విజయం కోసం కృషి చేసిన ఎన్‌ఎండీ ఫరూక్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి, మండలి చైర్మన్ పదవి దక్కింది. 2018 నవంబరులో మంత్రివర్గ విస్తరణలో ఫరూక్‌కు మరోసారి మంత్రి పదవి లభించింది. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రిగా 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల వరకు బాధ్యతలను నిర్వర్తించారు.

నంద్యాల నుంచి గెలుపొందిన వారు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థులు	పార్టీ
1952	మల్లు సుబ్బారెడ్డి	స్వతంత్ర
1955	జీరామిరెడి	స్వతంత్ర
1959	జీవెంకటరెడ్డి	కాంగ్రెస్
1962	మల్లు సుబ్బారెడి	స్వతంత్ర
1967	నబీసాహెబ్	కాంగ్రెస్
1972	బొజ్జా వెంకటరెడ్డి	స్వతంత్ర
1978	బొజ్జా వెంకటరెడ్డి	జనత
1983	ఎం.సంజీవరెడ్డి	టీడీపీ
1985	ఎన్‌ఎండీ ఫరూక్	టీడీపీ
1989	వీ.రామనాథ్‌రెడ్డి	కాంగ్రెస్
1994	ఎన్‌ఎండీ ఫరూక్	టీడీపీ
1999	ఎన్‌ఎండీ ఫరూక్	టీడీపీ
2004	శిల్పామోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2009	శిల్పా మోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2014	భూమా నాగిరెడ్డి	వైసీపీ
2017	భూమా బ్రహ్మనందరెడ్డి	టీడీపీ
2019	శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి	వైసీపీ



చెక్‌పోస్టులో బిందెతో అధికారులకు నీళ్లు

చరిత్రను మలుపు తిప్పిన

ఒక్క ఓటు

ఒక్క ఓటు అని వదిలేస్తే అధికారమే తారుమారు



శిరివెళ్ల, ఏప్రిల్ 26: రాష్ట్రం, దేశంలో సుపరిపాలన జరగాలంటే ప్రజాప్రతినిధులు సమర్థవంతులై ఉండాలి. అలాంటి నాయకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉంది. ఒక్కసారి ఓటు వేయకపోతే.. ఐదేళ్ల వరకు అవకాశం లేనట్టే. ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం వద్దు. ఆ ఒకే ఒక్క ఓటుతోనే ఎన్నో సంచనాలు చోటు చేసుకున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు కూలిపోయాయి. మరెందరికో అధికారాలు దూరమయ్యాయి. చేతికి అంది వస్తాయన్న అవకాశాలు సైతం ఆ ఒక్క ఓటుతోనే చేజారిపోయాయి. అందువల్ల పోలింగ్ కేంద్రానికి వెళ్లి మీ చేతిలోని బ్రహ్మాస్త్రాన్ని సంధించండి. ప్రజాస్వామ్య యజ్ఞంలో భాగస్వాములవండి.

మలుపు తిప్పిన చారిత్రక సందర్భాలివే.. :

- 1714లో ఒక్క ఓటు తేడాతో కింగ్‌జార్జ్-1 ఇంగ్లాడులో అధికారం పీఠం ఎక్కాడు.
- 1776వ సంవత్సరంలో అమెరికాలో ఒకే ఒక్క ఓటు తేడాతో జర్మన్ బదులుగా ఇంగ్లీషు అధికార భాష అయింది.
- 1800లో థామస్ జాఫ్సర్‌సన్, 1824లో జాన్‌క్విన్స్ ఆడమ్స్, 1876లో రూథర్‌ఫర్డ్ హెమ్స్‌లు ఎలక్టోరల్ కాలేజీలో ఒకే ఒక్క ఓటు తేడాతో అమెరికా అధ్యక్షులుగా పదవులను అధిష్ఠించారు.
- 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక్క ఓటు తేడాతో అడాల్ఫ్ హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయాడు. లేదంటే ప్రపంచ చరిత్ర వేరుగా ఉండేదేమో..!
- 1999లో కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో కూలిపోయింది.
- 2004లో కర్ణాటకలోని సంతెమరహళ్లి నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఏఆర్ కృష్ణమూర్తి ఒక్క ఓటుతో ఎమ్మెల్యే సీటును కోల్పోయారు.
- 2008 రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు సీపీ జోషి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయాడు. ఆయన గెలిస్తే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేవారు.
- ఒక్క ఓటు తేడాతో ఆంగ్లంపై హిందీ భాష గెలిచి మన దేశ జాతీయ భాషగా గుర్తింపు పొందింది.
- మీకు ఉన్న ఒక్క ఓటు కూడా అంతటి ప్రభావం చూపుతుందేమో.. నీ ఓటే సంచలనం సృష్టించవచ్చు. అభివృద్ధి చేసే వారికి ఓటు వేసి మీ భవిష్యత్తును మీరే మార్చుకోండి.


గడివేముల, ఏప్రిల్ 26: ఎన్నికల హీట్ పెరిగింది. గెలుపు కోసం ఆయా పార్టీల అభ్యర్థులు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలు, భయాందోళనకు గురి చేస్తున్నారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఎన్నికలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తూ ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు అధికారులను బృందాలుగా నియమించింది. అయితే క్షేత్రస్థాయిలో ఈ బృందాలు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో మండలంలో ఎన్నికల నియమావళి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

● **చూసీచూడనట్లుగా:** అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలు, సభలు, ర్యాలీలపై వీఎస్‌టీ బృందం, మండలంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఎంసీసీ బృందం, ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా చర్యలు తీసుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఎన్నికల సంఘం నియమించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నెల

నిద్రపోతున్న నిఘా..

- గ్రామాల్లో పర్యటించని ఎన్నికల అధికారుల బృందాలు
- పూర్తిస్థాయిలో అమలు కాని నియమావళి

రోజులు గడిచినా ఎన్నికల నియమావళి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని బిలకలగూడురు, గని గ్రామాల్లో వైసీపీ రంగులతో ఆ పార్టీ జెండా దిమ్మెలు దర్శనమిస్తున్నాయి. మంచాలకట్ట గ్రామంలో తాగునీటి ట్యాంకుకు వేసిన వైసీపీ రంగులను ఇంకా తొలగించలేదు. ఇవేగాక మండలంలో తెలంగాణ నుంచి భారీ స్థాయిలో మద్యం తరలించి విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు ఉన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ బృందాల వాహనాలకు అరకొరగా డీజిల్ కేటాయించడంతో పూర్తిగా తనిఖీలు చేపట్ట లేకపోతున్నామని అధికారులు అంటున్నట్లు వినికిడి.



బిలకలగూడురులో వైసీపీ రంగులో ఉన్న జెండా దిమ్మె

● **చినిగిపోయిన పరదాలు.. బిందెలతో నీళ్లు**

ఎన్నికల్లో డబ్బు, మద్యం ఇతర ప్రాంతాలకు తరలించకుండా చెక్ పోస్టులో వాహనాలను తనిఖీ చేసేందుకు ఎన్నికల సంఘం ఎస్ఎస్‌టీని ఏర్పాటు చేసింది. ఈ బృందం చెక్‌పోస్టుల వద్ద ఉంటూ వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తుంది. అయితే ఈ బృందం ఉండేందుకు సరైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరదాలు కూడా చినిగిపోవడంతో ఎండ తీవ్రతతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తాగేందుకు బిందెలతో నీరు తెచ్చి పెడుతున్నారు. ఎండకు వేడెక్కిన నీరు తాగడానికి ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందుతున్నారు.

పూర్తి స్థాయిలో డీజిల్ ఇస్తున్నాం: జవానుల్లాఖాన్, తహసీల్దార్

ఎన్నికల విధుల్లో పాల్గొనే బృందాల వాహనాలకు పూర్తిస్థాయిలో డీజిల్ పంపిణీ చేస్తున్నాం. అలాగే చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ టీమ్‌కు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

పెద్దల మాట

అప్పట్లో మాట ఇచ్చిన వారికే ఓటు



రుద్రవరం, ఏప్రిల్ 26 : అప్పట్లో మాట ఇచ్చిన వారికే ఓటు వేసేవారం. 86 ఏళ్ల వయస్సులో 2024లో మరోసారి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నాను. అప్పట్లో ప్రచారం తక్కువే. గ్రామానికి ఒక్కరు వచ్చేవారు చెప్పి వెళ్లేవారు. అప్పట్లో ఎన్నికల ఘర్షణలు లేవు, మనస్పర్థలు లేవు. నడుచుకుంటూ వెళ్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వచ్చేవారం. ఇంత ఆర్భాటం అప్పట్లో లేదు.

- పోలబోయిన వెంకటేశ్వర్లు


ఆ రోజుల్లో డబ్బు ప్రభావం లేదు...



ఆలూరు, ఏప్రిల్ 26: నేను 14 సార్లు ఎన్నికల్లో ఓటు వేశాను. నాకు ఇప్పుడు 90 ఏళ్లు. మరోసారి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నా. ఇప్పటి లాగా అప్పట్లో డబ్బులు ఇచ్చేవారు కాదు. ఎన్నికలు వస్తే పోటీ చేసేవారు గుడి దగ్గరకు వచ్చి మా గ్రామానికి కొన్ని హామీలు ఇచ్చేవారు. మేమంతా ఎవరికైతే మాట ఇచ్చామో వారికే ఓటు వేసే వాళ్లం. అప్పుడు ఇంత మంది అభ్యర్థులు కూడా ఉండే వారు కాదు. ఇప్పుడు ఎవరెవరో వస్తున్నారు. కొత్త కొత్త పార్టీల పేర్లు చెప్పి ఓట్లు అడుగుతున్నారు.


-కనకమ్మ, ఆలూరు

నడిచి వెళ్లి ఓటు వేశాం



రుద్రవరం, ఏప్రిల్ 26 : మా ఊరిలో పోలింగ్ కేంద్రం లేదు. శ్రీరంగాపురం టి.తుమ్మలకొట్టాల గ్రామానికి వెళ్లి అప్పట్లో ఓటు వేసి వచ్చాం. ప్రస్తుతం మా ఊరిలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. 82 ఏళ్ల వయస్సులో మరోసారి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నా. పూర్వం ప్రచారం అనేది ఇంత జోరుగా ఉండేది కాదు. ఓటు వేయమని అడిగే వారు. వెళ్లి వేసే వారం. అబ్బో.. ఇప్పుడు మైకులు, మేళాలు, తాళాలు, కరపత్రాలు ఇలా ఎన్నో. అప్పట్లో ఇవేమీ పల్లెల్లో కనిపించేవి కావు.

కోవర్టులు..!



అన్ని పార్టీల్లోనూ వేగులు

● ఉదయం ఓ చోట..రాత్రికి మరో చోట

● హడలెత్తిపోతున్న అభ్యర్థులు

ఆదోని, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల వేళ రాజకీయ కోవర్టులు రంగప్రవేశం చేశారు. ప్రత్యర్థి పార్టీలో ఏం జరుగుతుందో, వారి కదలికలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటున్నారు. ఎవరెవరిని కలుస్తున్నారు. వారి వ్యూహాలేమిటనే విషయాలను ఏ రోజుకారోజు అధినాయకులకు చేరవేయడమే వీరి పని. ప్రతిఫలంగా ముందస్తుగా మాట్లాడుకున్న మేరకు నేతల నుంచి తాయిలాలు అందుకుంటున్నారు. ఎన్నికలకు మరో 24 రోజుల సమయం ఉంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆయా నియోజకవర్గాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈసారి రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎత్తుకు పైఎత్తు వేస్తూ ముందుకు సాగుతున్నాయి. అభ్యర్థులు వ్యూహాలు రచిస్తూ ముందుకెళ్తున్నారు. ఆయా నాయకుల ఆలోచనలు, వ్యూహాలు తెలుసుకునేందుకు పార్టీలు కోవర్టులపై ఆధారపడుతున్నాయి. వీరు పార్టీలోనే ఉంటూ నమ్మకంగా వ్యవహరిస్తూ సమాచారాన్ని చేరవేరుస్తున్నారు. ఆ ప్రకారం ప్రత్యర్థులు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు తీసుకుటున్నారు.

తెలిసిపోతున్న వ్యూహాలు ..

జిల్లాలోని ఆయా నియోజకవర్గల్లో కోవర్టులు పదుల సంఖ్యలో ఉన్నారు. ప్రధాన పార్టీల్లో నమ్మకంగా మెసులుతూనే ప్రత్యర్థులకు ఇక్కడి విషయాలను పూసగుచ్చినట్లు వివరిస్తున్నారు. వేగుల రంగప్రవేశంతో రాజకీయ పార్టీల వ్యూహాలు చెదిరిపోతున్నాయి. రెండు, మూడు రోజులుగా కష్టపడి రచించిన వ్యూహం అమలు చేయడానికి ముందే ప్రత్యర్థి పార్టీల వారికి తెలుస్తుండటంతో అవాక్క వ్వ... న్నారు. ఈ తాజా పరిణామాలతో పార్టీలో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అని తేల్చుకోలేకపోతున్నారు. ఇటీవల ప్రతిపక్ష పార్టీలో ఉన్న నేతలు ఒక్కసారిగా పార్టీని వీడుతున్నట్లు సమాచారం రావడంతో ఆ నేతను బుజ్జగించి తిరిగి పార్టీలోనే ఉండే విధంగా ఒప్పించారు.

● ఫోన్ సంభాషణలపై..

ఎన్నికల వేళ ముఖ్యమైన నాయకులు ద్వితీయ స్థాయి నేతలతో ఫోన్లో మాట్లాడి కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఏం చేయాలో దిశా నిర్దేశం చేస్తున్నారు. ఎన్నికల వేళ అనుసరించే విధివిధానాలు గంపగుత్తంగా ఓట్లను కొనుగోలు చేయడానికి ఎలాంటి తాయిళాలు అందజేయాలి, వాటిని సమకూర్చుకోవడం ఎలాగో వివరిస్తున్నారు. విషయాలు బయటకి పొక్కవులే అనుకునేలోపే పరిసరాల్లోనే తిరుగుతున్న వేగులు ఏ సమయంలో ఎవరితో ఏం మాట్లాడారనే విషయాన్ని అవతలి నేతకు చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన అవతలి వారు తాయిలాలు ఇవ్వకపోయినా గంపగుత్త ఓట... ర్లకు ముఖ్యులుగా భావిస్తున్న వారి వద్దకు నేరుగా వెళ్లి విషయాన్ని చెప్పి వస్తున్నారు. దీంతో తమకు ఫలానా నాయకుని నుంచి హామీ లభించిందని సంబరపడి పోతున్నారు.

తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

ఎన్నికల వేళ వేగులు రాజకీయ పార్టీలకు గుబులు పుట్టిస్తుండటంతో వీరితో వేగేదెలా అంటూ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సొంత పార్టీ నేతలతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతూ వేగులుగా మారిన నాయకులు రాత్రి కాగానే ప్రత్యర్థి పార్టీలో ముఖ్యమైన నాయకులతో భేటీ అవుతున్నారు. అక్కడ మందు, విందుతో హంగామా చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలోనే పాల్గొంటూ వారి వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రత్యర్థి వారికి చేరవేస్తుండటంతో అభ్యర్థుల్లో భయం నెలకొంది. వివిధ పార్టీలో ఉన్న కోవర్టుల కారణంగా వీరితో ఏ పార్టీకి నష్టం జరుగుతుందో ఎవరికి లాభం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

ఎన్ని పతకాలు వస్తే ఏం లాభం..?

నిరుద్యోగి వేదన



కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 26: పులకుర్తి గ్రామానికి చెందిన జి.మహేష్‌కు పీఈటీ ఉద్యోగం సాధించాలని కల. ఈ మేరకు పాఠశాలలో పీఈటీ రవీంద్ర సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు సాగాడు. ఆటల పోటీల్లో పాల్గొని పలు ప్రశంసాపత్రాలు, పతకాలు పొందాడు. 2011 నుంచి 2021 మధ్య కాలంలో మహేష్ తన ఇంటర్, డిగ్రీ, బీపీఈడీ, ఎంపీఈడీ విద్యాభ్యాసం వరకు ఆటల ప్రస్థానాన్ని మరచిపోలేదు. 2015-18 మధ్య డిగ్రీ పూర్తయిన పిదప మరో ఆలోచన లేకుండా బీపీఈడీకి దరఖాస్తు చేసుకున్నాడు. అలా ఎస్వీయూలో 2018-20 మధ్య బీపీఈడీ, 2020-22 వరకు ఎస్కేలో ఎంపీఈడీ పూర్తి చేశాడు. బీపీఈడీ పూర్తయినప్పటి నుంచే డీఎస్సీ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టాడు. ఎంపీఈడీ పూర్తయ్యాక కోడుమూరులో ఓ అద్దె గదిలో ఉంటూ డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్నాడు. అయితే వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేస్తుందనే ఆశ ఆవిరైంది. ఇటీవల ఎన్నికల ముందు విడుదల చేసిన డీఎస్సీ కూడా నిర్వహించలేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని మహేష్ ఆవేదన చెందాడు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

● 50 తిరస్కరణ.. 232 ఆమోదం

● ఎంపీ అభ్యర్థుల నామినేషన్లలో 7 తిరస్కరణ



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నిక నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. జిల్లాలో ఎంపీ సహా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాఖలైన వాటిలో 50 నామినేషన్లు తిరస్కరించామని, 232 నామినేషన్లు ఆమోదించామని ఎన్నికల అధికారులు (ఆర్ఓ) పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంట్, కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలకు 184 మంది అభ్యర్థులు 282 నామినేషన్లు దాఖలు చేశారు. కర్నూలు పార్లమెంట్ స్థానానికి 27 మంది అభ్యర్థులు 41 నామినేషన్లు వేయగా.. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 157 మంది అభ్యర్థులు 241 నామినేషన్లు వేశారు. శుక్రవారం రిటర్నింగ్ అధికారులు స్క్రూటినీ నిర్వహించారు. నిబంధనలు ప్రకారం నామినేషన్ పత్రాలు పూరించకపోవడం, అభ్యర్థులను బలపరిచిన వ్యక్తుల ఓటర్ల జాబితాలో క్రమ సంఖ్యలు తప్పుగా వేయడం, ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసి బీ-ఫారం ఇవ్వకపోవడం.. వంటి కారణాలతో 50 నామినేషన్లను తిరస్కరించామని, 232 నామినేషన్లు ఆమోదించామని ఆర్ఓలు తెలిపారు. కర్నూలు పార్లమెంట్ స్థానానికి 41 నామినేషన్లు రాగా.. 7 తిరస్కరణకు గురయ్యాయి. 34 నామినేషన్లను ఆమోదించారు. ప్రధాన పార్టీన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు తమతో పాటు కుటుంబ సభ్యులతో పార్టీ అభ్యర్థులుగా డమ్మి నామినేషన్లు వేయించారు. పార్టీ బీ-ఫారాలు ఇవ్వకపోవడంతో మెజార్టీగా అలాంటి నామినేషన్లను తిరస్కరించినట్లు తెలుస్తోంది.

● నియోజకవర్గాల వారిగా వచ్చిన నామినేషన్లు, అభ్యర్థులు:


నియోజకవర్గం	నామినేషన్లు	తిరస్కరణ	ఆమోదం
కర్నూలు పార్లమెంట్	41	7	34
కర్నూలు అసెంబ్లీ	56	13	43
కోడుమూరు (ఎస్సీ)	31	5	26
ఎమ్మిగనూరు	28	5	23
మంత్రాలయం	17	2	15
ఆదోని	23	4	19
ఆలూరు	25	2	23
పత్తికొండ	24	4	20
పాణ్యం	37	8	29
మొత్తం	282	50	232

గోనెగండ్ల ఓటర్లే కీలకం

ఇక్కడ ఎవరికి మెజార్టీ వస్తే వారు గెలిచినట్టే..!

గోనెగండ్ల, ఏప్రిల్ 26: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎవరు గెలవాలన్నా గోనెగండ్ల మండల ఓటర్లు కీలకమవుతున్నారు. పునర్విభజనలో గోనెగండ్ల పత్తికొండ నుంచి ఎమ్మిగనూరుకు 2009లో చేరింది. గోనెగండ్ల నుంచి ఎవరికి మెజార్టీ వస్తే వారే అప్పట్లో పత్తికొండ ఎమ్మెల్యేగా గెలుపొందేవారు. 1989లో పాటిల్ శేషిరెడ్డి,(కాంగ్రెస్), 1994, 1999, 2004లో ఎస్వీ సుబ్బారెడ్డి(టీడీపీ) నుంచి గోనెగండ్ల మెజార్టీ ఆయా పార్టీలకు రావడంతోనే గెలుపొందారు. అప్పట్లో అభ్యర్థుల గెలుపోటములలో గోనెగండ్ల మండల ఓటర్లు కీలకమయ్యారు. అయితే 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా గోనెగండ్ల మండలం పత్తికొండ నుంచి ఎమ్మిగనూరులో చేరింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరురూరల్, ఎమ్మిగనూరు పట్టణం ఉన్నాయి.

అందులో ఎమ్మిగనూరు పట్టణం తరువాత అత్యధికంగా ఓట్లు గోనెగండ్ల మండలంలోనే ఉన్నాయి. గోనెగండ్లలో 57922 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు 29,061, స్త్రీలు 28,859, కాగా ఓబీసీలు 40,561. ఎస్సీలు 12,617. ఎస్టీలు 200. ఓసీలు 4,541 ఓట్లు ఉన్నాయి. ఈ మండలంలో ఎక్కువ గా బీసీ ఓట్లు ఉన్న మండలం. గోనెగండ్లలో 57,992 ఓట్లు, నందవరంలో 46,466 ఓట్లు, ఎమ్మిగనూరుటౌన్, రూరల్ కలిపి 1,38,679 ఓట్లు ఉన్నాయి. అయితే 2009 ఎన్నికల నుంచి గోనెగండ్ల ఓటర్లు ఎమ్మిగనూరు నియోజక వర్గం కు చెందిన ఎమ్మెల్యేకు ఓట్లు వేస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 2009లో కాంగ్రెస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి గోనెగండ్ల మండలం నుంచి 2500 ఓట్ల మెజార్టీ వచ్చింది ఆ మెజార్టీ తోనే ఆయన అప్పట్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 2012లో ఉప ఎన్నికలు వచ్చాయి అందులో వైసీపీ తరుపున చెన్నకేశవరెడ్డి గెలుపొందారు. అందులో గోనెగండ్ల మండలం నుంచి 15000 మెజార్టీ వచ్చింది. అయితే చెన్నకేశవరెడ్డి 25వేల మెజార్టీతో గెలుపొందారు. గెలుపులో గోనెగండ్ల కీలక పాత్రపోషించింది. ఇక 2014 లో టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరెడ్డి, వైసీపీ నుంచి చెన్నకేశవరెడ్డి కుమారుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి పోటీ చేశారు. అయితే గోనెగండ్ల మండలం నుంచి టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డికి 1525 ఓట్ల మెజార్టీ వచ్చింది ఇక బీవీ 14500 మెజార్టీ తో గెలుపొందారు. ఇక 2019లో టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరెడ్డి, వైసీపీ నుంచి చెన్నకేశవరెడ్డి పోటీ చేశారు. పోటీలో చెన్నకేశవరెడ్డి 25వేల మేజార్టీతో గెలుపొందారు. ఆయనకు గోనెగండ్ల నుంచి 12500 మెజార్టీ వచ్చింది. ప్రతి ఎన్నికలో నాడు పత్తికొండ నేడు ఎమ్మిగనూరులో గోనెగండ్ల మండలం నుంచి ఎవ్వరికి మోజార్టీ వస్తే వారే ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా గెలుస్తున్నారు. ఈ ఎన్నికల్లో గోనెగండ్ల ఓటర్లు ఎవరికి మొగ్గు చూపుతారో వేచి చూడాల్సిందే. అయితే పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజక వర్గాల్లోని నాయకులకు గోనెగండ్ల ఓటర్ల మనస్థత్వం ఇప్పటికీ అంతుచిక్కలేదనేది వాస్తవం. అయితే అనేక మంది రాజకీయ నాయకులు తమకు తెలిసినట్లు ఉపన్యాసాలు ఇస్తారే గాని గోనెగండ్ల ఓటర్లు ప్రతిసారి ఎన్నికల్లో తమదైన పద్ధతిలో తీర్పు ఇస్తునే ఉన్నారు.



1957లో తొలి సార్వత్రిక ఎన్నికల సమరం



శిరివెళ్ల, ఏప్రిల్ 26 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం 1957, ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 14 వరకు తొలి సార్వత్రిక ఎన్నికల సమరం జరిగింది. అప్పుడు రాష్ట్రంలో 55,61,345 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా 36,03,585 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పుడు ఈ సంఖ్య రాష్ట్రంలోని ఒక జిల్లా ఓటర్లతో సమానం. 1957 తొలి సార్వత్రిక ఎన్నికల సమహారం తెలుసుకుందాం.

● 1957లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 85 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

● మొత్తం 85 నియోజకవర్గాలలో 18 స్థానాలు ఎస్సీలకు, రెండు స్థానాలు ఎస్టీలకు కేటాయించారు.

● రాష్ట్ర వ్యాప్తంగా 47.67 పోలింగ్ శాతం నమోదైంది.

● కాంగ్రెస్‌కు 47.38 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రజా సోషలిస్ట్ పార్టీకి 5.65 శాతం, భారతీయ జన సంఘ్‌కు కేవలం 0.16 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు 36.46 శాతం ఓట్లు వచ్చాయి.

● మొదటి అసెంబ్లీ నియోజకవర్గంగా కల్వకుర్తి, చివరి అసెంబ్లీ నియోజకవర్గంగా దేవరకొండ ఉండేవి.

● రాష్ట్ర వ్యాప్తంగా 493 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. వాటిలో 174 తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన వాటిలో ఒక్కరు కూడా తమ నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు.

● పోటీ చేసిన 319 మంది అభ్యర్థులలో 81 మంది డిపాజిట్లు కోల్పోయారు.

● రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది మహిళలు పోటీ చేయగా.. వారిలో ఏడుగురు విజయం సాధించారు.

● మూడు నియోజకవర్గాల్లో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే ఎన్నికల బరిలో ఉండడంతో వారు ఏకగ్రీవంగా శాసన సభ్యులయ్యారు.

● 18 నియోజకవర్గాల్లో ఇద్దరు చొప్పున అభ్యర్థులు పోటీ చేశారు. 25 స్థానాల్లో ముగ్గురు చొప్పున, 21 స్థానాల్లో నలుగురు చొప్పున, మూడు స్థానాల్లో ఐదుగురు చొప్పున, 15 స్థానాలలో ఆరు నుంచి పది మంది ఎన్నికల బరిలో పోటీ చేశారు.

● ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధికంగా పది మంది అభ్యర్థులు పోటీ చేశారు.



డామిట్.. కథ అడ్డం తిరిగింది

● బెడిసి కొట్టిన వైసీపీ వ్యూహం

● రాజీనామాకు ఒప్పుకోని వలంటీర్లు

● చంద్రబాబు భరోసాతో తిరగబడుతున్న వైనం

● కక్కలేక..మింగలేకపోతున్న అధికార పార్టీ నేతలు



కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 26: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్లు వారధులని ఏలినవారు సుభాషితాలు చెప్పారు. లోగుట్టు ఎన్నికల వేళ బైటపడింది. ఇల్లిల్లూ తిరిగి ప్రజలకు సేవ చేయాలని పురమాయించినవాళ్లకే ఇప్పుడు ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైసీపీకి ఓట్లు వేయించాలని అధికారపార్టీ ఆదేశించింది. దీంతో వలంటీర్లు తిరగబడ్డారు. ఐదేళ్ల తమ సేవలు వినియోగించుకుని, ఇప్పుడు రాజీనామా చేయమంటారా? అని వైసీపీ నేతలపై మండిపడుతున్నారు.

పని చేయని రాజీనామా అస్త్రం

ఎన్నికల కమిషన్ జోక్యంతో వలంటీర్లంతా ఎన్నికల విధుల్లోనే కాదు..పింఛన్ల పంపిణీకి కూడా దూరంగా ఉన్నారు. అయినా వైసీపీ నాయకులు వలంటీర్ల సేవలను వినియోగించుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అవకాశం ఉన్న అన్ని దారులు మూసుకోవడంతో చివరకు రాజీనామా అస్త్రాన్ని తెరపైకి తెచ్చారు. అప్పటికే కొందరు రాజీనామా చేసి ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. దీంతో మోడల్ కోడ్ కాండక్ట్ రూపంలో కొందరు వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

● చంద్రబాబు భరోసానే తిరస్కరణకు కారణమా..!

ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. తాము అధికారంలోకి రాగానే వలంటీర్లు వ్యవస్థను కొనసాగిస్తూ గౌరవ వేతనం రూ.10 వేల ఇస్తామని ప్రకటించారు. దీంతో మొన్నటి దాకా వైసీపీకి వీరాభిమానులుగా ఉన్న వలంటీర్లు ప్రభుత్వంపై తిరగబడుతున్నారు. దీనిని పసిగట్టిన స్థానిక వైసీపీ నాయకులు వలంటీర్లపై వారం రోజులుగా ఒత్తిడి మొదలుపెట్టారు. వీరితో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరింత లబ్ధి చేకూరుస్తామని ఆశ చూపుతున్నారు. వారి మాటలు, హామీలు లెక్కచేయని చాలా మంది వలంటీర్లు టీడీపీ అధికారంలోకి వస్తే తమకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెబుతున్నారు.

● నగర పాలక సంస్థ పరిధిలో 2071 మంది వలంటీర్లు...

నగర పాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. కర్నూలు అసెంబ్లీ పరిధిలో 33, పాణ్యం అసెంబ్లీ పరిధిలో 16, కోడుమూరు అసెంబ్లీ పరిధిలో 3 వార్డులు ఉన్నాయి. మూడు నియోజకవర్గాలకు సంబంధించి 133 సచివాలయాల పరిధిలో 2071 మంది వలంటీర్లు సేవలు అందించేవారు. ఎన్నికల కమిషన్ జోక్యంతో ప్రస్తుతం వలంటీర్లు ఎవ్వరూ సేవలు అందించడం లేదు. ఎన్నికల విధుల్లో పాల్గొన్నారని నలుగురు వలంటీర్లును విధులను తొలగించారు. 9 మంది రాజీనామా చేశారు.

● పని చేయని అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు

ఈ దృష్ట్యా అధికార పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే తమకు 35 ఏళ్లు దాటిపోయాయని, ఇప్పుడు రాజీనామా చేస్తే తరువాత తమ పరిస్థితి ఏమిటని వలంటీర్లు వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. వయసు దాటిన తమకు ఎవరు ఉద్యోగం ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందనే గ్యారంటీ లేనందు వల్ల ఎన్నికల కమిషన్ ఆదేశాలను కాదనలేకపోతున్నామని, వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేమని తెగేసి చెబుతున్నారు. రాజీనామాలు చేయకుండా, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండ దూరంగా ఉంటున్నారు. దీంతో వైసీపీ నాయకులు కక్కలేక, మింగలేక ఇబ్బందిపడుతున్నారు.

రెండు సార్లు గెలిస్తే మూడోసారి ఓడినట్టే..!

ఆదోనిలో ఇదో రకమైన సెంటిమెంట్



హల్వీ సత్యనారాయణ



రాచోటి రామయ్య

ఆదోని టౌన్, ఏప్రిల్ 26: ఆదోని అసెంబ్లీకి ఇంతవరకు జరిగిన ఎన్నికల్లో ఏ ఎమ్మెల్యే కూడా వరుసగా మూడు సార్లు విజయం సాధించిన దాఖలాల్లేవు. రెండు సార్లు వరుసగా గెలిచిన వారు మూడోసారి గెలిచిన సందర్భం కాలేదు.

● హెచ్ సత్యనారాయణ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) 1972లో సీ శంకర్ రావు (ఇండిపెండెంట్) అనే అభ్యర్థిపై 11,086 ఓట్ల మెజారిటీతో మొదటిసారి విజయం సాధించారు. తిరిగి ఈయన 1978లో ఐఎన్‌సీ(సీ) పార్టీ అభ్యర్థిగా హెచ్ సీతారామిరెడ్డి (ఐఎన్‌సీ) పై పోటీ చేసి 12,378 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఇక వరుసగా మూడోసారి జరిగిన అసెంబ్లీ పోటీలలో ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్ ప్రకాష్ జైన్ చేతిలో 18,855 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

● రాచోటి రామయ్య (కాంగ్రెస్) 1985లో జరిగిన ఎన్నికల్లో పాండురంగారావు (టీడీపీ)పై పోటీ చేసి 10,053 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తిరిగి 1989లో కొంకా మీనాక్షినాయుడు (టీడీపీ)పై పోటీ చేసి 9,069 మెజారిటీతో గెలిచారు. మూడోసారి 1994లో కొంకా మీనాక్షినాయుడు చేతిలో 16,581 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

● మీనాక్షినాయుడు (టీడీపీ) 1994లో జరిగిన పోటీలో రాచోటి రామయ్య (కాంగ్రెస్)పై 16,581 ఓట్ల మెజారిటీతో గెలిచారు. రెండోసారి 1999లో కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి (కాంగ్రెస్)పై 14,428 ఓట్ల ఆధిక్యత సాధించి గెలిచారు. తిరిగి మూడోసారి పోటీ చేయడానికి అవకాశం లభించకపోవడంతో రెండు వరుస విజయాలతోనే సరిపుచ్చుకునేవారు.

ఆ రోజుల్లో అలా...

పప్పులు, బొరుగులు పంచేవారు



మహానంది: ఆ రోజుల్లో నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటించేటప్పుడు పప్పులు, బొరుగులు పంచేవారు. ముందు కార్యకర్తలు ఒక సంచి చేత పట్టుకొని ముందుకు వెళ్తుంటే... చిన్నతనం కాబట్టి వారి వెంట మేము వెళ్లేవాళ్లం. ఇప్పటికి, అప్పటికీ ఎన్నికల ప్రచారం పూర్తిగా మారిపోయింది. కాలక్రమేనా ఎన్నికల ప్రచారంలో మార్పు వచ్చింది. కరెన్సీ నోట్లు, మద్యం ఇస్తామంటేనే ప్రచారంలో పాల్గొనే రోజులు వచ్చాయి.

-పక్కీరయ్య యాదవ్, గాజులపల్లి

ముగిసిన నామినేషన్ల పరిశీలన..!

● నంద్యాల పార్లమెంటుకు 35 మంది

నంద్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వివరాలు సరిగా లేని అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, అన్ని వివరాలు సక్రమంగా ఉన్న అభ్యర్థుల నామినేషన్లను అధికారులు ఆమోదించారు. నంద్యాల పార్లమెంటుకు సంబంధించి 35 నామినేషన్లకు ఆమోదం లభించగా, 5 తిరస్కరణకు గురయ్యాయి. ఇక నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 31 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందగా, 10 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఆమోదించిన నామినేషన్ల సంఖ్య 28 కాగా, తిరస్కరణకు గురైనవి 5 ఉన్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 19 మంది నామినేషన్లు ఆమోదం పొందగా, 2 తిరస్కరణకు గురయ్యాయి. శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి 19 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు ఆమోదించగా, ఐదింటిని తిరస్కరించారు. అలాగే డోన్ నియోజకవర్గానికి సంబంధించి 21 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం లభించగా, రెండింటిని అధికారులు తిరస్కరించారు. నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించి 21 నామినేషన్లకు ఆమోదం లభించగా, 14 నామినేషన్లను తిరస్కరణకు గురయ్యాయి.

పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల వివరాలు

నియోజకవర్గం	ఆమోదం	తిర్కరణ
నంద్యాల పార్లమెంటు	35	6
నంద్యాల అసెంబ్లీ	31	10
బనగానపల్లె	28	5
నందికొట్కూరు	21	14
ఆళ్ళగడ్డ	19	2
డోన్	21	2
శ్రీశైలం	19	5
మొత్తం	139	38



నామినేషన్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

ఎన్నికల ప్రచారంలో టీజీ భరత్


ముస్లింతో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 10 వార్డులో ఖడక్‌పుర, చాకలిగేరి ప్రాంతాల్లో ఆయన టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలు, పెద్దలు, యువతను కలిసి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముస్లింలకు అండగా ఉండి.. సంక్షేమం, అభివృద్ధి అందించేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు జీయా, నౌషద్, మోహబూబ్ ఖాన్, ఆదిష్, ఇంజార్, నిజాం, ఇమాన్ తదితర నాయకులు పాల్గొన్నారు,

ఫ్యాక్టరీలను పంపించేసిన ఘనత వైసీపీదే

కర్నూలుకు చేరుకున్న నిరుద్యోగ చైతన్య యాత్ర

పారిశ్రామికవేత్తలను తరిమేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని కర్నూలు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు నిరుద్యోగ యువత చేపట్టిన నిరుద్యోగ యాత్ర చేపట్టిన యాత్ర కర్నూలు చేరుకుంది. నగరంలోని గుమ్మజ్ ప్రాంతంలో టీజీ భరత్‌ను కలిసి మద్దతు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. యువత తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని టీజీ భరత్ కోరారు.


నిరుద్యోగ యాత్ర యువతతో టీజీ భరత్

ఆరోగ్యంపై గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి


మహిళలకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

ఓర్వకల్లు, ఏప్రిల్ 26: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొమరోలు సచివాలయంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బిడ్డకు కనీసం 2 నుంచి 3 సంవత్సరాల వరకు ఎడమ దూరంగా ఉండడం మంచిదన్నారు. ప్రసవం సమయంలో తల్లికి గర్భస్రావం ఉండటం వల్ల మరలా శరీరం రక్తం పుంజుకుని సంసిద్ధత వచ్చే వరకు ఎడమ అవసరమని తెలిపారు. శిశువు పాల పోషణకు కూడా రక్తం అవసరం ఉంటుందని, కనుక మొదటి బిడ్డకు రెండేళ్లు నిండిన తర్వాతనే రెండో బిడ్డకు ప్రణాళిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రేఖ, ఎంపీడీవో మల్లేశ్వరి, ఆర్బాలిక్ ఆఫీసర్ సత్యనారాయణ ఆరోగ్య పర్యవేక్షకులు శిలువ జ్యోతి, ప్రకాష్, సామాజిక ఆరోగ్య అధికారి రూత్ పరిమళ, ఆరోగ్య, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఓర్వకల్లు, ఏప్రిల్ 26: మండలంలోని శకునాల గ్రామంలో దళిత సురేష్ (37) శుక్రవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సురేష్ భార్య రెండున్నర సంవత్సరాల క్రితమే మృతి చెందడంతో మానసికంగా కుంగిపోయి తన ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

110 మంది వలంటీర్లు రాజీనామా

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 26: జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 110 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో రాజీ నామా చేసినట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 తేదీ వరకు 1251 మంది రాజీనామా చేయగా 26న ఒక్క రోజే 110 మంది రాజీనామా చేసినట్లు సీఈఓ తెలిపారు. రాజీనామాలను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు. క్రిష్ణగిరి-13, కౌతాళం-1, మద్దికెర-1, కోసిగి-45, గూడూరు నగర పంచాయతీ-21, కల్లూరు-3, ఓర్వకల్లు-1, పత్తికొండ-8, గూడూరు రూరల్-6, గోనెగండ్ల-2, ఆదోని-9 ఉన్నారు.

రేపు రజక ఆత్మీయ సమావేశం


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 26: నగరంలోని మౌర్యఇన్ పరిణయ ఫంక్షన్ హాలులో ఈనెల 28న రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రజక సాధికార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీపీ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో వారు కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా సీపీ వెంకటేష్ మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కారం కావాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రజక సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ గుర్రపుసాల రామక్రిష్ణ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ సీహెచ్ లింగమయ్య, జోనల్ ఇన్‌చార్జి వెంపెంట రాంబాబు, జిల్లా మహిళా కన్వీనర్ రేణుక, సిటీ మహిళా కన్వీనర్ రాధమ్మ, సూర్యనారాయణ, శ్రీను, శివ, న్యాయవాది జగదీష్ పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: గౌరు

కల్లూరు, ఏప్రిల్ 26: పాణ్యం నియోజకవర్గంలో టీడీపీని గెలిపించాలని భర్త గౌరు వెంకటరెడ్డి, కుమారుడు గౌరు జనార్ధన్‌రెడ్డి శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, 27వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ సీఎం చంద్రబాబుకు సంపద ఎలాపెంచాలో తెలు సని జగన్‌కు ప్రజా సంపదను ఎలా కొల్లగొట్టాలో మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, సాయి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, అయ్యప్ప యాదవ్, బీజేపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, మాంద్ర నరేంద్రరెడ్డి, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.



గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు సోమయాజులపల్లె వాసులు

గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిక : పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత సమక్షంలో కల్లూరు అర్బన్ 36వ వార్డుకు చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు జి.సర్వేశ్వరరెడ్డితతోపాటు పది కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరాయి. వీరికి గౌరు చరిత టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఎల్లరాముడు, మద్దిలేటి, ఎన్.సోమన్న ఉన్నారు. కార్యక్రమంలో 36వ వార్డు టీడీపీ వార్డ్ ఇన్‌చార్జి ఆర్. తిరుమలేశ్వరరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

గౌరు వెంకటరెడ్డి సమక్షంలో..: పాణ్యం తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరువెంకటరెడ్డి సమక్షంలో ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు ఆకుల మహేష్(బోరు మహేష్)తో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. టీడీపీ కండువాల కప్పి వారిని పార్టీలోకి గౌరు వెంకటరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో గౌరుచరితమ్మ గెలుపుకు కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆకుల కొండయ్య, శ్రీరామ శ్రీనివాసరెడ్డి, శ్రీరామ లేతపాణీశ్వరరెడ్డి, దేవేంద్ర, శేఖర్, అడపాల ఆనంద్, వరకూటి పుల్లయ్య, శ్రీరామ తిరుపాలు, గాజ. చంద్రమౌళి, గోవింద్‌శీను, రామక్రిష్ణ, హనుమంతరావు, వీరభద్రుడు, బాలసుబ్బీ ఉన్నారు, కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పాలకొలను సుదాకరరెడ్డి, హుస్సేనాపురం చంద్ర పెద్దస్వామి, బోయ నాగమల్లేస్, డీలర్ ప్రతాప్, బ్రాహ్మయ్య ఆచారి, గాజా.రామమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు వెంకటరెడ్డి, గౌరు జనార్ధన్‌రెడ్డి

వైసీపీ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యం

టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి


మునగాలపాడులో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి దస్తగిరి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 26: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యచయ్యాయని కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఆరోపించారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. కర్నూలు అర్బన్ మండలం పరిధిలో ఉన్న మునగాలపాడు, న్యూ వెంచర్స్ ప్రాంతాలలో శుక్రవారం బొగ్గుల దస్తగిరి ఇంటింటా తిరిగి టీడీపీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు మాస్టిక్ సుంకన్న, మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు నాయకులు కలిసి మునగాలపాడులో దస్తగిరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్రాన్ని చీకటి మయం చేసిన వైసీపీకి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు ఇచ్చారు. టీడీపీని అధికారంలోకి వస్తే తప్పకుండా సమస్యలను దశల వారిగా పరిష్కరించి మునగాలపాడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అయ్యన్న, కుమార్, ఎర్ర పక్కిరన్న, నారాయణగౌడ్, శివరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లలదొడ్డిలో విష్ణు ప్రచారం

సి.బెళగల్, ఏప్రిల్ 26: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ ఈరన్నగౌడు, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ మండల కన్వినర్ తిమ్మప్ప, ప్రకాశ్‌గౌడు, వెంకటేశ్‌గౌడు, మాజీ సర్పంచ్ భాస్కరెడ్డి ఉన్నారు.


గొల్లలదొడ్డిలో ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

'కూటమి అభ్యర్థుల గెలుపే మాదిగల లక్ష్యం'


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మాదిగ కుల సంఘాల జేఏసీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 26: టీడీపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మాదిగ కుల సంఘాలు పని చేయాలని జేఏసీ నాయకులు తీర్మానించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఏపీ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పేరపొగు వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్, టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు డీ.జేమ్స్, మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్న కంటీ రమేష్, జై మాదిగ సేవా సంఘం అధ్యక్షుడు కొదమల బెంజిమెన్‌లు హాజరై ప్రసంగించారు. జగన్ రెడ్డి పాలనలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీల సంక్షేమం కోసం చంద్రబాబు అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను సీఎం జగన్ రద్దు చేశారని మండిపడ్డారు. మాదిగలంతా ఏకమై టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో గంధం శ్రీనివాసులు, ఆర్ విజయ్, వెల్చూర్తి నవీన్, జయన్న, వేండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 26: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విద్య, పర్యావరణ మంత్రిత్వశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించిన గ్రీన్ ఓలింపియాడ్ ఫర్ యూత్ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జహనార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సి.బెళగల్, ఏప్రిల్ 26: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో కస్తూర్బా పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కర్నూలు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కొండాపురం గ్రామానికి చెందిన దాసరి శేఖర్ తాగిన మత్తులో బైక్‌పై వస్తూ బస్సును చూసుకోకుండా ఎదురు వెళ్లాడు. అయితే డ్రైవర్ గమనించి చాకచక్యంగా వేగాన్ని అదుపు చేశాడు. దాసరి శేఖర్‌కు గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణికులతా క్షేమంగా ఉన్నారు. దీనిపై కేసు నమోదు కాలేదు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన


గూడూరులో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 26: గూడూరులో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను టీడీపీ నాయకులు పరిశీలించారు. శుక్రవారం గూడూరులో టీడీపీ నాయకులు కురుకుంద రామాంజనేయులు, గజేంద్ర గోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గూడూరులో చంద్రబాబు పర్యటనకు హెలిప్యాడ్, రోడ్‌షో, రాత్రి బస ఏర్పాట్లను పరిశీలించారు. టీడీపీ నాయకులు పౌలు, సుమన్‌బాబు, మన్సూన్‌బాషా, నాగప్పయాదవ్, పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 26: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కర్నూలు సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఉన్న స్కేటింగ్ రింగ్‌లో జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్కేటింగ్ క్రీడాకారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

సి.బెళగల్, ఏప్రిల్ 26: మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకుడు శంకర్‌బాబురెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శంకర్‌బాబురెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అభ్యర్థులు వీరే..

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 26: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు బీ ఫామ్‌లు అందజేశారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా పీజీ రాంపుల్లయ్య యదవ్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా షేక్ జిలాని బాషా, కోడుమూరు అభ్యర్థిగా పరిగెల మురళీ కృష్ణ, మంత్రాల యం అభ్యర్థిగా పీఎస్ మురళీ కృష్ణరాజు, ఎమ్మిగనూరు అభ్యర్థిగా ఎం.కాశీం వలీ, ఆదోని అభ్యర్థిగా జి.రమేష్ యాదవ్, ఆలూరు అభ్యర్థిగా ఎ.నవీన్ కిషోర్, పత్తికొండ నియోజకవర్గానికి ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థిగా సీపీఐ రామచంద్రయ్య పేర్లను ఖరారు చేసినట్లు డీసీసీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 26: పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, యువత వాటిని సద్వి నియోగం చేసుకోవాలని ఈశ్వరాస్ ట్యూటోరియల్స్ గౌరవాధ్యక్షు డు ఈశ్వరయ్య తెలిపారు. ఈశ్వరాస్ ట్యూటోరీయల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బిరాగేటు ప్రీమియర్ జూనియర్ కళాశాలలో పాలిటెక్నిక్ శిక్షణా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ శిక్షణా శిబిరంలో నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇచ్చారన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాదించవచ్చన్నారు. అనంతరం అధ్యాపకులు ఇర్ఫాన్, సునితా రోజాను సంస్థ గౌరవాధ్యక్షులు ఈశ్వరయ్య శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

550 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 26: కోడుమూరు స్టేషన్ పరిధిలో సెబ్ పోలీసులు బెల్లం ఊట ధ్వంసం చేసి నాటుసారా సీజ్ చేశారు. శుక్రవారం సెబ్ సీఐ రామాంజ నేయులు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని ఎల్ బండ గ్రామం దగ్గర నాటు సారా బట్టి గుర్తించి, నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 550 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. అలాగే గోవర్ధనగిరిలో 20 లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈదాడుల్లో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, శంకర్, నాయక్, సువర్ణమ్మ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో శివాలయం ప్రారంభం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 26: పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో కర్నూలు సద్గురుదత్త కృపాలయం వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాలయం, అపర కర్మల భవనాన్ని శుక్రవారం కృపాలయం గౌరవ అధ్యక్షురాలు మాత కృష్ణకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా కృపాలయం అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లా డుతూ గత 13 సంవత్సరాలుగా సంస్థ తరఫున శ్మశాన వాటికలో ఉచితంగా పూడికలు, కాష్ఠాలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు డి.రాకేశ్, జి.నిర్మలారెడ్డి, కార్యదర్శి పి.శ్రీధర్‌గుప్త, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆదోని ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు

ఆదోని, ఏప్రిల్ 26: ఆదోని అసెంబ్లీ స్థానానికి 15 మంది నామినేషన్‌లు వేశారు. శుక్రవారం నామినేషన్‌ల పరిశీలన చేపట్టారు. అందులో నాలుగు నామినేషన్‌లు తిరస్కరించారు. వైసీపీ నుంచి వై మనోజ్ రెడ్డి, ప్రభాత రెడ్డి, బీజేపీ నుంచి ప్రకాష్ జైన్, చంద్రకళ నామినేషన్‌లను బీ-ఫారం లేనందున తిరస్కరించారు. 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పరిశీలనలో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, జైభారత్ నేషనల్ పార్టీల అభ్యర్థులు పార్థసారధి, సాయిప్రసాద్ రెడ్డి, రమేష్ యాదవ్, రంగన్న స్వతంత్ర పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఎమ్మిగనూరు ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు

ఎమ్మిగనూరు/ రూరల్, ఏప్రిల్26: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని ఆర్వో చిరంజీవి చేపట్టారు. టీడీపీకి చెందిన నిత్యాదేవి, వైసీపీ కి చెందిన బుట్టా నీలకంఠ ఆ పార్టీకి చెందిన బీఫారాలు అందజేయకపోవడంతో తిరస్కరించారు. బీజేపీ తరఫున నామినేషన్ వేసిన కేఆర్. మురహరిరెడ్డి, కాంగ్రెస్ తరఫున క్రాంతినాయుడు, బీఎస్పీ తరఫున హంద్రి బంగారప్ప సైతం ఏ, బీ ఫారాలు సమర్పించకపోవడంతో వారి నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఐదుగురు తిరస్కరణకు గురికాగా 10 మంది బరిలో నిలిచారు.

మంత్రాలయం బరిలో 10 మంది అభ్యర్థులు

మంత్రాలయం, ఏప్రిల్ 26: మంత్రాలయం నియోజకవర్గంలో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి మురళి, అసిస్టెంట్ ఆర్వో శ్రీధర్‌మూర్తి తెలిపారు. గురువారంతో నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో శుక్రవారం ఆయా రాజకీయ పార్టీలతో నామినేషన్ల పత్రాలను పరిశీలన చేశారు. మొత్తం 10 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, కరణం గురురాజరావు, యశోదమ్మ ఉన్నారు.

టీడీపీ హయాంలోనే పట్టణాభివృద్ధి : బీవీ

- యూజీడీ పేరుతో పట్టణాన్ని గుంతలమయంగా మార్చారు
- రివర్స్ టెండర్ పేరుతో జీడీపీ పైపులైన్‌ను ఆపేశారు
- బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన బనవాసి గ్రామస్థులు
- లింగందిన్నెలో బీవీకి ఘన స్వాగతం




ఎమ్మిగనూరు ప్రచారంలో భాగంగా మహిళలతో బీవీ, బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన బనవాసి గ్రామస్థులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్26: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధి సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 24వ వార్డు నాగప్ప కట్టల ప్రాంతంతోపాటు 5,6,9,1621వ వార్డుల్లో టీడీపీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సూపర్-6 పథకాలను వివరించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఐదేళ్లలో పట్టణంలో ఒక్క అభివృద్ధి పనికూడా జరగలేదన్నారు. 12ఏళ్ల క్రితం ప్రారంభించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పథకం నేటికీ పూర్తికాలేదన్నారు. యూజీడీ పేరుతో పట్టణంలోని సీసీ రోడ్లన్నీ తవ్వి గుంతలమయంగా మార్చారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశానని గుర్తుచేశారు. ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో అభివృద్ధిని విస్మరించిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అభివృద్ధికి బాటలువేయాలని కోరారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, కౌన్సిలర్ రాందాసుగౌడు, మాజీ కౌన్సిలర్ రంగస్వామిగౌడ్, కటారి రాజేంద్ర, మీసేవా ఈశ్వర్, నాయకులు రాందాసుగౌడు, మిఠాయి నరసింహులు, రామకృష్ణనాయుడు, రంగస్వామిగౌడు, ముల్లాఖలీముల్లా, తురేగల్ నజీర్, గుల్లా సలాం, బిజ్జె నాగరాజు, భాస్కర్, సోములగూడూరు మాబాషా పాల్గొన్నారు.

బనవాసి గ్రామం నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వయాన అల్లుడు బిఆర్. బసిరెడ్డి స్వగ్రామమైన బనవాసి గ్రామం నుంచి 30 కుటుంబాలు బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. నాయకులు సురేష్, అబ్రహం, వీరనాగప్ప, రాజశేఖర్, గోపాల్, నరసింహులు, జగదీష్, లోకేష్ పాల్గొన్నారు.

లింగందిన్నెలో ఘనస్వాగతం

గోనెగండ్ల: మండల పరిధిలోని కున్నూరు, బోదేపాడు, తిప్పనూరు, వీరంపల్లి, లింగందిన్నె గ్రామాల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ, ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు తప్పెట్లతో బాణ సంచ పేల్చుతూ బీవీకి ఘనస్వాగతం పలికారు. పలు కూడళ్లలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్క గ్రామంలో కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం గుంతలు పడ్డ రోడ్ల మరమ్మత్తు కూడా చేయలదని విమర్శించారు. అభివృద్ధిని విస్మరించిన జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలలో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, రమేష్‌నాయుడు, ఎర్రబాడు శ్రీనివాసులు, బేతాలబడేసా, నూరహమ్మద్, భారతం ర హంతుల్లా, పక్రుద్దీన్, రంగస్వామినాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగందిన్నె ప్రచారంలో మాట్లాడుతున్న బీవీ

బీసీల సత్తా చాటుదాం : రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 26: బీసీలను చులకన చేసి మాట్లాడుతున్న బాలనాగిరెడ్డికి బీసీలంటే ఏమిటో తెలిసేలా సత్తాచూపాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన బీసీ కురువ సామాజికవర్గం నుంచి 35 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. శుక్రవారం మాధవరంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి వైసీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కురువ కిట్టప్ప, చెవిటి మల్లయ్య, లింగప్ప, తాయప్ప, వినోద్, నర్సిరెడ్డి, రామాంజి, నాగరాజు, దేవర నాగప్ప, నాగిరెడ్డి, కురువ బీరప్ప, రాజు, వీరేంద్ర, కుమ్మరి మునెప్ప, వీరయ్య, మల్లయ్య కుటుంబాలతో పాటు మరికొంత మంది టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పెద్దకడుబూరు టీడీపీ నాయకులు మల్లికార్జున, నాగిరెడ్డి, నర్సప్ప, లింగప్ప, అయ్యప్ప, యూనిట్ ఇన్‌చార్జి భీరప్ప, అబ్బిలి బీరప్ప, నరసింహ, పెద్ద రాగప్పజనసేన నాయకులు నర్సారెడ్డి, రామాంజి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది

మాజీ డిప్యూటీ సీఎం కేఈ.క్రిష్ణమూర్తి



మండల టీడీపీ నాయకులతో కేఈ.క్రిష్ణమూర్తి

వెల్దుర్తి, ఏప్రిల్, 26 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని మాజీ డిప్యూటీ సీఎం కేఈ.క్రిష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన వెల్దుర్తి మండలానికి వచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మన శివశంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు, మాజీ మండల అధ్యక్షుడు సుబ్బరాయుడులు పుష్పగుచ్చాలు అందజేశారు. బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో మాజీ ఎంపీపీ శైలజా సుబ్బరాయుడు నివాసంలో బసచేశారు. నియోజకవర్గ, మండల నాయకులతో కలసి ఎన్నికల్లో అనుసరించాల్సిన గెలుపు వ్యూహాలపై సలహాలు తెలియజేశారు. అనంతరం బ్రహ్మగుండంలో బ్రహ్మేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీలోకి భారీగా వలసలు

- హొళగుందకు చెందిన 150 మైనార్టీ కుటుంబాలు
- వందవాగిలిలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక
- మైనార్టీలను వైసీపీ మోసం చేసింది : వీరభద్రగౌడ్



మైనార్టీల సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

హొళగుంద, ఏప్రిల్ 26: మండల కేంద్రంలోని 4వ వార్డుకు చెందిన 150 మైనార్టీకి చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. అలాగే వందవాగిలి గ్రామంలో 50 కుటుంబాలు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి టీడీపీ ఎన్నో సంక్షేమ పథకాలను తెచ్చిందని అన్నారు. అలాంటి మైనార్టీలను వైసీపీ పార్టీ మోసం చేసిందని, దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, విదేశీ విద్యలాంటి పథకాలను మైనార్టీలకు దూరం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు ద్వారా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తిప్పయ్య, టీడీపీ సీనియర్ నాయకులు ఈడిగ గోవింద్ గౌడ్, మిక్కిలినేని ప్రసాద్, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జయరాం, బీజేపీ నాయకుడు వెంకటరాముడు, మైనారిటీ నాయకుడు ఎండీ ఆదాం, ఎండీ హళ్లి సుధాకర్, మైనారిటీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అల్తాఫ్ హుసేన్, కర్నూలు జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ బాష, వక్ఫ్‌బోర్డు మెంబర్ జాకీర్, మాజీ వైస్ సర్పంచ్ అబ్దుల్ సుభాన్ పాల్గొన్నారు.



వైసీపీకి చెందిన మైనార్టీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వీరభద్రగౌడ్

రెండు నామినేషన్లు తిరస్కరణ



ఆలూరులో నామినేషన్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

ఆలూరు, ఏప్రిల్ 26: ఆలూరు అసెంబ్లీ స్థానానికి 25 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన చెపట్టారు. అందులో టీడీపీ నుంచి రెండు సెట్లు నామినేషన్ వేసిన గిరి మల్లేష్ గౌడ్ బీ-ఫారం సమర్పించలేదనే కారణంతో తిరస్కరణకు గురైంది. అలాగే వైసీపీ నుంచి బూసినే రామాంజమ్మ రెండు సెట్లు నామినేషన్లు వేశారు. ఆమె కూడా బీ ఫారం సమర్పించలేదనే కారణంతో నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ తెలిపారు. మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, రెండు తిరస్కరణకు గురి అవ్వడంతో 13 మంది నామినేషన్లు ఆమోదం పొందినట్లు తెలిపారు. పరిశీలనలో టీడీపీ, వైసీపీ, బీసీవై, బీఎస్పీ, జై భారత్ నేషనల్ పార్టీల అభ్యర్థులు వీరభద్ర గౌడ్, విరుపాక్షి, మోహన్ ప్రసాద్, రామలింగ, షేక్షా వలి, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పోలీసు అబ్జర్వర్ ఉమేష్ కుమార్

ఆదోని, ఏప్రిల్ 26: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎన్నికల పోలీసు పరిశీలకులు (అబ్జార్వర్) ఉమేష్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ భద్రత అంశాలపై చర్చించి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని, పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలగకుండా పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని సంబంధిత పోలీసులు అధికారులకు ఎన్నికల పోలీస్ అబ్జార్వర్ ఉమేష్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శివ నారాయణ స్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, మున్సిపాల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాధ్యత మరింత పెరిగింది



టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరిగా ప్రకటించిన సందర్భంగా గుడిసె కృష్ణమ్మకు కేక్ తినిపిస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు

ఆదోని, ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అధిష్ఠానం తనను గుర్తించి, అధికారికంగా ప్రకటించినందుకు టీడీపీకి, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటానని గుడిసె క్రిష్టమ్మ అన్నారు. శుక్రవారం ఎన్డీఏ కూటమి అభ్యర్థి ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆమె మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా టీడీపీని నమ్ముకుంటూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారం చేపట్టినప్పుడు బాధ్యతగా తమ వంతు సేవలు అందించామన్నారు. అందుకు గాను గతంలో ఆదోని బీసీ మహిళ అభ్యర్థిగా అవకాశం దక్కిందని, అనంతరం 2014-19 మధ్యన రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్‌గా టీడీపీ అధిష్ఠానం తనను నియమించిందని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మరింత బాధ్యతని అప్పగించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడతానని తెలిపారు. అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు సమక్షంలో భారీ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, జనసేన ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభంగా సుశమీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, ఏప్రిల్ 26: సుశమీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో బంగారు రథంపై సుశమీంద్రతీర్థుల చిత్రపటాన్ని ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి డిప్యూటీ ఈవో లోకనాథన్ అధికారికంగా తెచ్చిన పట్టు వస్త్రాలను మహాముఖద్వారం నుంచి ఊరేగింపుగా తెచ్చి బృందావనం ముందు ఉంచి పూజలు చేసి సుశమీంద్రతీర్థుల బృందావనానికి అలంకరణ చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేఈ.శ్యాంబాబు

వెల్దుర్తి, ఏప్రిల్, 26 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మల్లెపల్లె, ఎన్.వెంకటాపురం, బొమ్మిరెడ్డిపల్లె, నరసాపురం, అల్లుగుండు గ్రామాలలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఈ.శ్యాంబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలోనే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. డిప్యూటీ సీఎం కేఈ.కృష్ణమూర్తి హయాంలో మల్లెపల్లెలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. అంతకు ముందు బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో వాగు పొంగితే గ్రామ ప్రజలు రాకపోకలు సాగించేవారు కాదని, గ్రామంలో మంచినీటికి ప్రజలు ఇబ్బందిపడేవారని పేర్కొన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టి కొళాయిల ద్వారా గ్రామ ప్రజలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. గ్రామంలో ప్రతి వీధికి సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టిన ఘనత తమదేనన్నారు. మండలంలో నీరు-చెట్టు ద్వారా భూగర్భజలాలను పెంచి నియోజకవర్గంలో 68 చెరువులకు నీరు అందించామన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడు, బలరాంగౌడు, జ్ఞానేశ్వర్‌గౌడు, జయరాముడు, రామకృష్ణ ఆచారి, రామకృష్ణ అమర్‌నాథ్‌గౌడు, వెంకటరాముడు, సుధాకర్‌గౌడు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి : డీఎస్పీ

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్26: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. శుక్రవారం కడిమెట్ల, సిరాలదొడ్డి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు శాంతియుతంగా జీవించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్డీఏ కూటమికే వీరశైవ జంగమల మద్దతు

ఆదోని టౌన్, ఏప్రిల్ 26: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వీరశైవ జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు, కర్నూలు శివరాజ్, మల్లికార్జున అన్నారు. శుక్రవారం వీరు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివద్ధి కోసం నరేంద్ర మోదీని మూడవ సారి ప్రధానమంత్రిగా, నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించడం అవసరమని అన్నారు. జిల్లాలోని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయం కోసం వీరశైవ జంగమలతో పాటు బీసీ వర్గాలు మద్దతు తెలపాలని కోరారు. గాజుల చంద్ర శేఖర్, ఎండీ భద్రీనాథ్, కన్నె జగదీష్ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడు దేవేంద్రగౌడ్ మృతి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 26: ఎమ్మిగనూరుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, వీరశైవ ఐక్యవేదిక సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు వై దేవేంద్రగౌడ్(77)శుక్రవారం కన్నుముశారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. దేవేంద్రగౌడ్ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే గా ఎమ్మిగనూరు కు పోటీ చేశారు. ఆయన గతంలో ఎమ్మిగనూరు బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.